క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు నాయకుల పరామర్శ



కోటిని పరామర్శిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరంలో వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు పరామర్శించారు. పాలపర్తి సతీష్ తండ్రి ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను పార్టీ ఇన్‌చార్జి కంబాల జోగులు, మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు ఎంఎస్ పేట ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో ఆదివారం శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు మందా రాము తదితరులు తగు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా హాజరయ్యారు.

రామ్‌సింగ్‌కు ఘన నివాళి



రామ్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీఐ అప్పన్న, సిబ్బంది

పాయకరావుపేట: స్థానిక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించిన స్వర్గీయ రామ్‌సింగ్‌కు సీఐ జి.అప్పన్న, ఎస్‌ఐ పురుషోత్తమ్ శనివారం ఘనంగా నివాళులర్పించారు. రామ్‌సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు శనివారం రామ్‌సింగ్ పెద్దకర్మ సందర్భంగా పోలీసు సిబ్బంది స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయనకు అంజలి ఘటించారు.

బోయిలమ్మ ఆలయం ప్రారంభం



బోయిలమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కన్నబాబురాజు తదితరులు

అచ్యుతాపురం రూరల్ : చీమలాపల్లిలో బోయిలమ్మ అమ్మవారి నూతన ఆలయాన్ని ఆదివారం యలమంచిలి మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు రాజు) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సియ్యాద్రి బుజ్జి, మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, ఎంపీపీ కోవ సంధ్యబుజ్జి, జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, మాజీ సర్పంచ్ సియ్యాద్రి భైరాగినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు నగిరెడ్డి నాగేశ్వర్రావు, బలిరెడ్డి శ్రీను, ఉమ్మిడి జగన్, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


సారా తయారీ, విక్రయం నేరం



పెంటకోటలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

పాయకరావుపేట: నాటు సారా తయారీ, విక్రయం నేరమని ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. పెంటకోటలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. సారా తయారు చేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. సారా సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. నాటు సారా వల్ల కలిగే దుష్పలితాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటు సారాకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ సేల్స్



తూకంలో తేడా..

ఇక్కడ కొన్ని దుకాణాల్లో తూకంలో తేడా వస్తుందని ప్రచారం జరుగుతోంది. కిలోకి 900 గ్రాములే వచ్చేలా కొందరు వ్యాపారులు విక్రయాలు చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు. నకిలీ రాళ్లు ఉపయోగిస్తూ, తూనిక యంత్రాలను నచ్చినట్లు ఎడ్జస్ట్ చేసి నిరక్ష్యరాస్యులను మోసం చేస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

- ఉపమాకలో మసాలా ఘుమఘుమలు
- తిరునాళ్లలో జోరుగా సుగంధ ద్రవ్యాల వ్యాపారం
- వెంకన్న సన్నిధిలో కొంటే ఏడాదంతా ఆరోగ్యమని భక్తుల నమ్మకం



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న మసాలా దినుసుల దుకాణాలు



ఉపమాక తీర్థంలో విక్రయిస్తున్న సుగంధ ద్రవ్యాలు

నక్కపల్లి: ప్రముఖ పుణ్య క్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తిరునాళ్లలో పప్పు దినుసులు, సుగంధ ద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతోంది. స్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఈ ఆలయం వద్ద 15 రోజుల పాటు పెద్ద ఎత్తున తీర్థం జరుగుతుంది. తిరునాళ్లలో వివిధ రకాల వస్తువులు విక్రయిస్తారు. కల్యాణోత్సవాల నుంచి కొత్త అమావాస్య వరకు ఇక్కడ మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాల అమ్మకాలు జరుగుతాయి. అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, తూర్పు గోదావరి జిల్లా తుని, రాజమండ్రి, రాజవొమ్మంగి, రంపచోడవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడ ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేస్తారు.

పసుపు, కుంకుమ, జీలకర్ర, వెల్లుల్లి, లవంగాలు, యాలకలు, ఆవాలు, ఎండుద్రాక్ష, ఖర్జూరం, కిస్‌మిస్, తేనె తదితర సుగంధ ద్రవ్యాలు ఇక్కడ లభిస్తాయి. అలాగే ఆవాలు, జీలకర్ర, మెంతులు, మినపప్పు, **పసు**పు కొమ్ములు, చింతపండు, వేరుశనగ పలుకులు, శెనగపప్పు, కొమ్ము శెనగలు, ఎండు **మిర్చి**, వంట **నూనె**లు, కొబ్బరి **నూనె**, కారప్పొడి, ఒడియాలు, చిప్స్ వంటి నిత్యావసర సరకులు హోల్‌సేల్ ధరకే విక్రయిస్తుండడంతో ఏడాదికి సరిపోయేలా ఇక్కడ కొనుగోలు చేయడానికి జనం ఆసక్తి చూపుతారు. దీనికి తోడు ఇక్కడ **దొరికే సరకులకు** బయట కొనుగోలు **చేసే సర**కులకు మధ్య కిలోకు **రూ.30** నుంచి రూ. 50 **వరకు** వ్యత్యాసం ఉంటుం**దని** కొనుగోలుదారులు చెబుతున్నారు. అలాగే స్టీలు, ఇత్తడి, రాగి, ప్లాస్టిక్, గాజుల వ్యాపారం, వంట గదుల్లో వాడే వివిధ రకాల గృహోపకరణాలు కూడా ఇక్కడ తక్కువ ధ**రకే** దొరుకుతాయి. ప్రతి **ఏటా** సుమారు రూ.70 లక్షల **నుంచి** కోటి రూపాయల వ**రకు ఇక్కడ** వ్యాపారం జరుగుతుంది. దాదాపు 30 ఏళ్లుగా ఇక్కడ సుగంధ ద్రవ్యాల వ్యాపారం జరుగుతోంది. స్వామి సన్నిధిలో లభించే పసుపు, కుంకుమలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తే ఎటువంటి అనారోగ్యం కలగదని, ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. ఇదంతా దశాబ్దాల తరబడి వస్తున్న ఆనవాయితీగా స్థానికులు చెబుతుంటారు.

వ్యాపారం బాగుంది..



వెంకన్న సన్నిధిలో లభించే పసుపు, కుంకుమ వంటివి కొనుగోలు చేస్తే మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. ఏడాదికి ఒకసారి ఇక్కడ వ్యాపారం చేస్తే రాణిస్తామనేది వ్యాపారుల నమ్మకం. చాలా ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్నాను. అమ్మకాలు బాగానే ఉన్నాయి. ఇక్కడ బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకే అన్నీ దొరుకుతాయి. సెంటిమెంట్ పరంగా ఏడాదికి సరిపడా సరకులు కొనుగోలు చేస్తారు.

– కక్కిరాల శ్రీను, వ్యాపారి, ఉపమాక

నాణ్యత బాగుంటుంది..



దాదాపు 30 ఏళ్ల నుంచి వెంకన్న కల్యాణం చూడ్డానికి వస్తుంటాం. అలాగే ఇక్కడ దొరికే సరకులు కొంటున్నాం. స్వామి గుడి దగ్గర అమ్మే సరకుల్లో నాణ్యత ఉంటుంది. ఏడాదికి సరిపడ సరకులు కొంటా. మా ఇళ్లల్లో జరిగే పెళ్లిళ్లు, పేరంటాలలో ఇవే వాడతాం. మా పూర్వీకులు కూడా ఇక్కడి సరకులే కొనేవారట. ధరలు కూడా తక్కువగానే ఉంటాయి. రేటు ముఖ్యం కాదు స్వామి సన్నిధిలో కొన్నామనే సెంటిమెంట్ అంతే.

– సూర్యకాంతం, కొనుగోలుదారు

గూడుపమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో రేబాకలో నూతనంగా నిర్మించిన గూడుపమ్మ తల్లి ఆలయాన్ని ఆదివారం పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఇటీవలే ఆలయాన్ని లక్షలాది రూపాయల వ్యయంతో శక్తిపీఠంగా పునర్నిర్మించారు. మెరక గ్రామాల ప్రజలు తమ ఆరాధ్య దైవంగా, వనదేవతగా కొలిచే గూడుపమ్మ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఆదివారం వివిధ మెరక గ్రామాల నుంచి భక్తులు, పదో తరగతి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయంలో నిత్యం అమ్మవారికి అష్టోత్తర పూజలు, ఆరాధనలు, నిత్య ప్రసాద వితరణ చేస్తున్నారు.

పొగమంచుతో అవస్థలు



మునగపాక మెయిన్ రోడ్డులో కురుస్తున్న పొగమంచు

మునగపాక: మండలవ్యాప్తంగా ఆదివారం ఉదయం పొగమంచు కురవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు. ఉదయం 7 గంటలు కావస్తున్నా మంచు విపరీతంగా కురవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక లైట్లు వేసుకొని మరీ రాకపోకలు సాగించారు. అలాగే పాదచారులు కూడా పొగమంచుతో ఇబ్బందులు పడ్డారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ



కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మునగపాక: మండలంలోని మెలిపాక దళిత వాడలో కల్యాణ మండపం నిర్మించేందుకు ఆదివారం భూమిపూజ చేశారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ రూ.22 లక్షల ఎస్సీ, ఎస్టీ నిధులు మంజూరు చేయించారు. దీంతో సంబంధిత పనులకు సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు, వైఎస్సార్‌సీపీ దళిత నేత గుంట్ల అప్పారావు, కూటమి నేతలు రాజశేఖర్, గణేష్ తదితరులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విజయ భాస్కరరాజు మాట్లాడుతూ మెలిపాక పంచాయతీ పరిధిలోని దళితవాడలో కల్యాణ మండపం, ప్రహరీ నిర్మాణానికి జిల్లా పరిషత్ ద్వారా నిధులు కేటాయించిన స్వామి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన అప్పలరాజు



అప్పలరాజును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం: ఇన్‌చార్జి ఎంపీపీగా ఎంపికైన చోడిపల్లి అప్పలరాజు ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, పలువురు పార్టీ ఎంపీటీసీ సభ్యులు అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ రాజకీయాల్లో నిస్వార్థంగా సేవలందించే వారికి ఊహించని స్థాయిలో పదవులు అలంకరిస్తాయని కొనియాడారు. మత్యకార కుటుంబం నుంచి వచ్చిన అప్పలరాజు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పాల్గొని గుడివాడ సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీగా, ఆ క్రమంలో వైస్ ఎంపీపీగా ఎంపిక అయ్యారన్నారు. వ్యక్తి గత కారణాలతో ఎంపీపీ పదవికి కోన లోవలక్ష్మి రాజీనామా చేయడంతో అప్పలరాజుకు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించారన్నారు. జెడ్పీటీసీ కాకర దేవి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వాకపాడు సర్పంచ్ చోడిపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కోన లోవలక్ష్మి, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, కేసుబోయిన వెంకటలక్ష్మి, బొండా వెంకటలక్ష్మి, నాగంబోయిన ఉమ, బైపా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి విరాళాలు



రూ.40 వేలు విరాళం అందజేస్తున్న సుధీర్



రూ.25 వేలు విరాళం అందిస్తున్న త్రిమూర్తులు తదితరులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి బందారుపేటలో ఇటీవల నూతనంగా నిర్మించిన కోదండ రామాలయానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. నక్కపల్లికి చెందిన నున్న సుధీర్ రూ.40 వేలు, నర్సీపట్నం మండలం బాలారం గ్రామానికి చెందిన వానపల్లి త్రిమూర్తులు రూ. 25 వేలు ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయానికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడం, ఆలయ నిర్వాహణ తదితర అభివృద్ధి పనుల కోసం వీటిని వినియోగించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. విరాళాలు అందజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు



యలమంచిలి దిమిలి రోడ్డు కూడలిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి గ్రంథాలయాధికారి డి.కోటేశ్వర్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. అనంతరం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ద్వారా పిల్లల చేత పుస్తకాలు చదివింపజేశారు. వారికి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర వివరించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం వెలకట్టలేనిది..

యలమంచిలి రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని పలువురు సీనియర్ సిటిజన్లు, వ్యాపారవేత్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసిన ఆయన నేటి యువతరానికి స్ఫూర్తినిచ్చారన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని దిమిలిరోడ్డు కూడలి వద్ద ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్ద నేతి సురేష్, రాజేష్, పలువురు వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో కేంద్రాలు 19
- పరీక్ష రాయనున్న విద్యార్థుల సంఖ్య 4043



పాయకరావుపేట బాలికల పాఠశాల పరీక్షా కేంద్రం



నక్కపల్లిలో గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రం



ఎస్. రాయవరం మండలం ధర్మవరంలో సిద్ధం చేసిన బెంచీలు



యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పూర్తయిన ఏర్పాట్లు

నక్కపల్లి: టెన్త్‌పరీక్షలకి సర్వం సిద్ధమయింది. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రశ్నపత్రాలను నాలుగు రోజుల క్రితమే మండల కేంద్రాలకు తీసుకొచ్చి పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. మండల కేంద్రంలోని నక్కపల్లిలో గల 14 పాఠశాలల్లో 928 విద్యార్థులు 5 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. అలాగే పాయకరావుపేటలో 12 పాఠశాలల్లో 1468 విద్యార్థులు 7 కేంద్రాల్లో, కోటవురట్లలో 5 పాఠశాలల్లో 532 మంది విద్యార్థులు 2 కేంద్రాల్లో, ఎస్.రాయవరంలో 15 పాఠశాలల్లో 1115 మంది విద్యార్థులు 5 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వెనుక బడిన విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. రాత్రిపూట ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలనే దానిపై అవగాహన కల్పించారు. పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఆదివారం సమీపంలో ఉన్న ఆలయాలకు వెళ్లి హాల్ టికెట్లను ఉంచి పూజలు చేశారు.

నాలుగు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ..

యలమంచిలి రూరల్: సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల కోసం పట్టణంలో నాలుగు కేంద్రాలు కేటాయించారు. బాలికోన్నత పాఠశాల, కోర్టుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ హైస్కూల్, శ్రీచైతన్య స్కూళ్లను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఇప్పటికే ఇన్విజిలేటర్లను కూడా నియమించారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంట్ అధికారి పరీక్షల నిర్వహణ బాధ్యతలు చూడనున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.

పరీక్షలకు ఏర్పాట్లు చేశాం..



టెన్త్ విద్యార్థులు నిర్ణయించిన సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఏర్పాట్లు చేశాం. తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు, వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశాం.

– కుమార స్వామి, సీఐ నక్కపల్లి

ప్రశ్నపత్రం బాగా చదవాలి..



టెన్త్ విద్యార్థులు 15 నిమిషాల పాటు ప్రశ్నపత్రం బాగా చదువుకుని అర్థం చేసుకోవాలి. కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయం కల్పించాం. టెన్షన్ పడకుండా విద్యార్థులు పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలి.

– కుంచం నరేష్, ఎంఈవో నక్కపల్లి

రేపు గంగ పరదేశమ్మ తల్లి పండగ

మునగపాక: మండలంలోని తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో 18వ తేదీన గంగ పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భక్తులను ఆకట్టుకునే నేల వేషాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి గంగ పరదేశమ్మ తల్లిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. పండగ సందర్భంగా అన్ని ఏర్పాటు పూర్తి చేసిన తెలిపారు.

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



ఎంఈవో శ్రీజోష్

కోటవురట్ల: టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని, మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని ఎంఈవో శ్రీజోష్ తెలిపారు. మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల నుంచి 432 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. కోటవురట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 78 మంది విద్యార్థులు నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్లో పరీక్షలు రాస్తుండగా కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ నుంచి 65 మంది, జల్లూరు జెడ్పీ హైస్కూల్ నుంచి 87 మంది, కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 80 మంది, కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి 86 మంది, కోటవురట్ల కేజీబీవీ నుంచి 30 మంది విద్యార్థులు కోటవురట్లలోని రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అచ్యుతాపురం రూరల్ : సెజ్ పునరావాస కాలనీ సమస్యలపై నియోజకవర్గ కూటమి నాయకులు స్పందించి కాలనీ వాసులకు న్యాయం చేయాలని ఉపసర్పంచ్ రాజాన విజయ్ కోరారు. ఆదివారం వీడియో ద్వారా సెజ్ కాలనీ సమస్యలపై గళం విప్పారు. కూటమి నాయకులను గెలిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారని, గెలిచాక ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వర్రావు సమస్యల పరిష్కారంలో చొరవ చూపించట్లేదని వాపోయారు. ఇప్పటికైనా సెజ్ కాలనీ వాసుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి ఎన్నికల హామీ నెరవేర్చాలని విజయ్ కోరారు.

ఉపాధి బకాయి బిల్లులు చెల్లించాలి

కె.కోటపాడు : ఉపాధి వేతనదారులకు 11 వారాలకు సంబంధించిన బకాయి బిల్లులను అధికారులు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలో సూర్రెడ్డిపాలెం, వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం, పోతనవలస, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.